క్లుప్తంగా

సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని, సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ ఎస్.విద్యావతి తెలిపారు. మంగళవారం నరసింహాపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమయ్యారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని తెలిపారు. వలంటీర్లు కేటాయించిన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ.. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. మండల విస్తరణాధికారి రమేష్, హౌసింగ్ ఏఈ దాము, పంచాయతీ కార్యదర్శి ధరణి పాల్గొన్నారు.

సంతాపం

విజయపురం : మండలంలోని కోసలనగరం గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రాజు (55) మృతికి మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌స్వామి మంగళవారం సంతాపం తెలిపారు. సమాచారమందుకున్న ఆయన ఆ గ్రామానికి చేరుకుని మదన్‌మోహన్‌రాజు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపినాథ్, నాయకులు ఉన్నారు.

26 మందికి కంటి ఆపరేషన్లు


కంటి రోగులతో ఆస్పత్రి యాజమాన్యం

వెదురుకుప్పం: తిరుపతి తాటితోపు సమీపంలోని సురేంద్ర కంటి ఆస్పత్రిలో మండలానికి చెందిన 26 మంది కంటి రోగులకు మంగళవారం ఆపరేషన్లు నిర్వహించినట్లు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం తెలిపారు. ఇటీవల వెదురుకుప్పంలో సురేంద్ర కంటిఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్ కోసం 26 మందిని ఎంపిక చేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం వారికి ఆపరేషన్లు చేసి, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి సంరక్షణ జాగ్రత్తలను తెలియజేసినట్లు సుబ్రమణ్యం తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురంలో వెలసిన శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ భాస్కర్ మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా పొన్నా నరసింహులు

శ్రీరంగరాజపురం: మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా పొన్నా నరసింహులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. కోకన్వీనర్లుగా యగంధర్ రెడ్డి, శ్రీధర్, ఏకాంబరం, పొన్నా వెంకటేష్ నియమితులయ్యారు.

రెండు గుడిసెలు దగ్ధం


కాలిపోతున్న గుడిసెలు

శ్రీరంగరాజపురం: విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో రెండు పూరి గుడిసెలు దగ్ధమైన సంఘటన మండలంలోని పుల్లూరు ఎస్టీకాలనీలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... పుల్లూరు ఎస్టీ కాలనీకి చెందిన గోవిందయ్య కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. చీకటి పడడంతో గుడిసెలోని లైటు వేసేందుకు స్విచ్ ఆన్ చేయడంతో ఆకస్మాత్తుగా స్విచ్‌బోర్డు నుంచి మంటలు చెలరేగి గుడిసెకు అంటుకున్నాయి. దీంతో ఆయన గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆ సమయంలో గాలులు వేగంగా వీయడంతో మంటలు అదుపు కాక పక్కనే ఉన్న అంకయ్య గుడిసెకు వ్యాపించాయి. దీంతో రెండు గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో గోవిందయ్య ఇంట్లో రూ.20 వేలు నగదు, నిత్యావసర సరుకులు, అంకయ్య ఇంట్లో 5 సవరాలు బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్రవాహనం, పూర్తిగా కాలి పోయాయి. స్థానికులు తహసీల్దార్ షబ్బీర్‌బాషాకు సమాచారం అందించడంతో తహసీల్దార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంఘటనకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం


గంగాధరనెల్లూరులో సైక్లింగ్ చేస్తున్న విద్యార్థులు


వెదురుకుప్పం: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గంగాధరనెల్లూరు: ప్రతి రోజూ సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని నెల్లేపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, అప్పిరెడ్డికండిగ గ్రామాల్లో మంగళవారం సైక్లింగ్ మారథాన్ మేళా సందర్భంగా సైకిల్ తొక్కడంతో కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌తో కండరాలు వృద్ధి చెంది, శారీరక దృఢత్వం చేకూరుతుందన్నారు. అలాగే అధిక బరువు నివారణకు అవకాశం ఉందన్నారు. రక్తపోటు రాకుండా నివారించుకోవచ్చన్నారు. మనస్సు ప్రశాంతంగా ఉంటూ చక్కటి నిద్ర పడుతుందన్నారు. గుండె జబ్బులు రావని చెప్పారు. కేన్సర్‌ను జయించేందుకు అవకాశం ఉందన్నారు. పొగాకు ఉత్పత్తులు బీడీ, సిగరెట్, హాన్స్, గుట్కా, ఖైనీ లాంటి మత్తు పదార్థాలు కేన్సర్ అనర్థాలకు దారి తీస్తుందన్నారు. మంచి పోషకాహార పదార్థాలను భుజించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, సీహెచ్‌ఓ స్వరూప, ఏఎన్‌ఎం సుమతి, కన్నెమ్మ పాల్గొన్నారు.

శారీరక దృఢత్వం

వెదురుకుప్పం: సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం చేకూరుతుందని వైద్యాధికారి సురేఖ అన్నారు. మంగళవారం మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో సైక్లింగ్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైక్లింగ్ చేయడంతో కండరాలు బలపడి శరీరంలోని క్యాలరీలను తగ్గించవచ్చన్నారు. అధిక రక్తపోటును నియంత్రించి, గుండె సంబంధిత వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులను నడక, సైక్లింగ్ ద్వారా నియంత్రించవచ్చని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పొగాకు, మద్యం సేవించడం వంటి వ్యసనాలకు అలవాటు పడకూడదన్నారు. కేన్సర్ వంటి ప్రమాకర వ్యాధులను యోగా ద్వారా నియంత్రించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి ప్రభాకర్ రెడ్డి, కమలనాభన్, శ్యామల, ఏఎన్‌ఎంలు కమలాబాయి, సుధ, ఆశావర్కర్లు గీత, బుజ్జి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని దోచేసింది చంద్రబాబే


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: రాష్ట్రాన్ని దోచేసింది చంద్రబాబే అని, ఇందుకు గత ఎన్నికల ఫలితాలే నిదర్శనమని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఎ.హరి అన్నారు. మంత్రి ఆర్కే రోజాపై టీడీపీ నాయకులు లోకేష్, భానుప్రకాష్ చేసిన నిరాధార ఆరోపణలను హరి తీవ్రంగా ఖండించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి ఆరోపణలను టీడీపీ నాయకులు దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఫవర్‌ల్యూమ్స్ కార్మికుల బాగోగులు చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో నగరిలోని పవర్‌ల్యూమ్స్ కార్మికుల ఉపాధి నిమిత్తం ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా 20.5 లక్షల మీటర్ల యూనిఫామ్ ఆర్డర్లను ఇప్పించడంతో పాటు ఇందుకు సంబంధించిన రూ.10.86 కోట్లను నగరి వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీకి అందించిన ఘనత మంత్రి రోజాకే దక్కిందన్నారు. మంత్రి నేతృత్వంలో నగరిలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, దీనిపై బహిరంగకు చర్చకు రావాలని డిమాండ్ చేశారు. లోకేష్ యువగళం పాదయాత్ర పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎం అవుతారనే పగటి కలలు కంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలను నవరత్నాల పథకాల ద్వారా తీర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ మాట్లాడుతూ మంత్రిగా రోజా రాష్ట్ర ప్రజలందరికీ న్యాయం చేయాల్సి ఉందని, ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు తన సోదరులను పురమాయించి స్థానిక ప్రజలకు న్యాయం చేస్తున్నారని చెప్పారు. దీన్ని ఇక్కడ ఐదుగురు ఎమ్మెల్యేలంటూ లోకేష్ మాట్లాడడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. ఇటీవల గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన నిందితులు టీడీపీ నాయకులేనని చెప్పారు. నిందితులతో లోకేష్ తీసుకున్న సెల్ఫీలను ప్రదర్శించారు. స్మగర్లు ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు తెలుసునని, మంత్రి రోజాపై తప్పుడు ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు ఏకాంబరం, గుణశేఖర్, జాన్ కెనడీ, చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరయ్యయాదవ్, జయబాబు, చిన్నా, చక్రీ, మునెయ్య, కడియాలనాయుడు, ప్రవీణ్, బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌పై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు రూరల్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు అవినీతి ఆరోపణలు చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై మంగళవారం పుత్తూరు ఎంపీపీ ఎ.మునివేలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా యువగళం పాదయాత్ర పేరిట సోమవారం పుత్తూరులో బహిరంగ సభ నిర్వహించారని, మహిళా మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారని, మహిళా మంత్రిని అసభ్య పదజాలంతో దూషించారన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, కోఆప్షన్ సభ్యుడు రామబత్తయ్య, శిరుగురురాజుపాళెం సర్పంచ్ మురళీయాదవ్ ఉన్నారు.

లోకేష్ వ్యాఖ్యలు అజ్ఞానానికి నిదర్శనం

శ్రీరంగరాజపురం: డిప్యూటీ సీఎం నారాయణస్వామి హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకుందని డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధిని కంటితో చూడలేని నారా లోకేష్ పాదయాత్రలో ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు మంజూరు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, పేదలకు ఇంటి స్థలాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాధ్యమైందని తెలిపారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నా టీడీపీ ప్రజలను మోసం చేసిందని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, నాయకులు జనార్దన్, కుప్పయ్య, మణి, డీఎస్‌రాజు, ప్రమీల, మహేష్ ,బాబు, గండు, చిన్నబ్బ, శ్రీధర్, అమృతరాజు తదుతరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొబైల్ ఆధార్ క్యాంప్‌లు


ఆధార్‌లో మార్పు, చేర్పులు చేయించుకుంటున్న కార్డుదారులు

పాలసముద్రం : ఆధార్ కార్డు అప్‌డేట్, మార్పులు, చేర్పుల కోసం ప్రజలకు ఇబ్బందులు తప్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ క్యాంప్‌లు కొనసాగుతున్నాయని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి సునీత, నరేష్ ఆధ్వర్యంలో క్యాంపులు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని సచివాలయాల వారీగా తేదీలను ప్రకటించి, ఆయా తేదీల్లో అక్కడ క్యాంపులు ఏర్పాటు చేసి ఆధార్ సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలు ఆధార్ కార్డులను అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేయించుకోకపోవడంతో కొందరు పథకాలకు అనర్హులుగా మారుతున్నారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్‌లు ఏర్పాటు చేసిందన్నారు. గతంలో ఆధార్ అప్‌డేట్ మార్పులు, చేర్పులు, కోసం బ్యాంకులు, పోస్టాఫీసులు, అనుమతి ఉన్న కేంద్రాల వద్దకు వెళ్లి గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. అలాంటి పరిస్థితి లేకుండా చేసేందుకు ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయడంతో ప్రజలలో విశేషస్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మోహన్, శివ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే క్షయవ్యాధి నివారణ


పోషకాహారం కిట్లు అందజేస్తున్న రవిరాజు

వెదురుకుప్పం: పోషకాహారంతో క్షయవ్యాధిని నివారించవచ్చని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ రవిరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టీబీ రోగులకు వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. సాధారణంగా వారం రోజులుగా దగ్గు, జ్వరం, గళ్లలో రక్తం వంటి లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాధిని నిర్ధారించే యంత్రాలున్నాయని తెలిపారు. టీబీ రోగులకు ప్రభుత్వం అందించే చికిత్సలతో పాటు తన వంతు కూడా పోషకాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు రకాల పోషకాహార సరుకులు అందజేస్తున్నట్లు చెప్పారు. రోగులు వైద్యంతో పాటు పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. లేకుంటే టీబీ నయం అయ్యే పరిస్థితి తక్కువన్నారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. అనంతరం వైద్యాధికారి సురేఖ మాట్లాడుతూ టీబీ రోగుల కోసం తమ వంతు రూ.11 వేలు వ్యయంతో పౌష్టికాహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. టీబీ వ్యాధి తీవ్రత ఆధారంగా తిరుపతి రుయాతోపాటు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణయ్య, ఏఎన్‌ఎంలు సుధ, ఎర్రసానమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి


నగదు అందజేస్తున్న హెచ్‌ఎం మనోహర్‌నాయుడు


పాలసముద్రం : బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం బలిజకండ్రిగ సీఆర్పీ పరిధిలోని గ్రామాల్లో బలిజకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌నాయుడు తమ సిబ్బందితో కలసి బడి బయట పిల్లలను గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ పర్యవేక్షించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే నాడు–నేడు, అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యావసతి తదితర పథకాలను అమలు చేస్తుందన్నారు. హెచ్‌ఎం మనోహర్ నాయుడు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, టై, బూట్లు, ఐడీ కార్డు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు తదితరాలు పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తోందని, మీ పిల్లలను బడిలో చేర్పాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎం మనోహర్ నాయుడు, ఉపాధ్యాయుడు ఏలుమలై వితరణ చేసిన నగదు బడిబయట పిల్లల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రాజేశ్వరి, మహిళ పోలీస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీ నివారణకే వెట్టిచాకిరి చట్టం


మాట్లాడుతున్న న్యాయవాది రాజేష్

పుత్తూరు రూరల్: బలహీన వర్గాల శ్రమదోపిడీని నివారించడానికి ప్రవేశపెట్టిన చట్టమే వెట్టిచాకిరి చట్టమని న్యాయవాది రాజేష్ తెలిపారు. మంగళవారం వెట్టిచాకిరి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లులో పుత్తూరు న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబపరంగా, ఆచారం, ఒప్పందం తదితర షరతులతో పనులు చేయిస్తే వెట్టిచాకిరి కిందకు వస్తుందని తెలిపారు. వెట్టిచాకిరి చేయిస్తే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. వెట్టిచాకిరిని పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిల్లు మేనేజర్ మాధవన్, లేబర్ ఆఫీసర్ హేమాచ్చారి పాల్గొన్నారు.

రికార్డు సక్రమంగా రాయాలి


మాట్లాడుతున్న ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : మండలంలోని వీఓఏలు రికార్డులను సక్రమంగా రాయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్యపోషణ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులు, సిబ్బందికి రికార్డులు ఏ విధంగా రాయాలి, స్త్రీనిధి రికవరీ ఎలా చేయాలి, ఇంటి వద్ద పెరటి కోళ్లు, తోటలు ఎలా పెంచాలన్న అంశాలపై అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో వారికి పాడి పశువుల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు రూ. 50 వేలు ఇస్తుందని తెలిపారు. ఇంతవరకు ఉన్నతి, స్త్రీనిధి నుంచి రుణం తీసుకోని సభ్యులు రుణాల కోసం సంఘమిత్రల వద్ద దరఖాస్తు అందజేయాలని తెలిపారు. సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

ఏర్పేడు: మండలంలోని డిక్షన్ కర్మాగారం సమీపంలోని పిల్లారిగుంట వద్ద ట్రాక్టర్‌తో ఇద్దరిని ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్బీకేల్లో మెరుగైన సేవలు


కియాస్కో మిషన్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఏఓ

పాలసముద్రం : రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం ఆర్‌బీకేలో రైతులు, వలంటీర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ కియాస్కో విధానంతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు సకాలంలో అన్ని సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయన్నారు. వాతావరణ సమాచారం, వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ధరలు తెలుసువచ్చన్నారు. ఈ విధానంలో రైతులే స్వయంగా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు ఆర్డర్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. పంట యాజమాన్య పద్ధతులపై ఆరిబీకేలో వీడియో రూపంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు, వ్యవసాయ సహాయకురాలు వనజ పాల్గొన్నారు.

వృత్తి విద్యతోనే ఉజ్వల భవిత

వెదురుకుప్పం: ఇంటర్‌లో వృత్తివిద్యా కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని కళాశాల ప్రిన్సిపల్ నిర్మలాకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వృత్తి విద్యా కోర్సులు గ్రామీణ విద్యార్థులకు వరంలాంటిదన్నారు. ఇంటర్ పూర్తి అయిన తరువాత ఎవరిపైనా ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. ఈటీ (ఎలక్ట్రికల్ టెక్నీషియన్), ఓఏ(ఆఫీస్ అసిస్టెంట్‌షిప్) వంటి కంప్యూటర్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. టెన్త్ పూర్తి చేసిన పిల్లలను ఇంటర్‌లో వృత్తి విద్యా కోర్సుల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కళాశాలలో ల్యాబ్ సౌకర్యం, కంప్యూటర్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్య అధ్యాపకులు ఢిల్లీప్రసాద్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, గౌస్‌బాషా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.